తాగర అన్నా.. తాగి ఊగర అన్నా!

- పెద్దదోర్నాల పల్లెల్లో సారా జోరు
- దాడులు చేస్తున్నా ఆగని వ్యాపారం
- ప్రజల ఆరోగ్యం ఛిద్రం

పెద్దదోర్నాల:

మండల పరిధిలోని పనుకుమడుగు పరిసర ప్రాంతాల్లో నాటుసారా తయారీ కేంద్రాలపై ఎక్సైజ్, పోలీస్, ఫారెస్ట్ అధికారులు దాడులు నిర్వహించి 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. నల్లగుంట్ల పరిసర ప్రాంతాల్లో నాటుసారా తయారీ కేంద్రాలపై పోలీస్ అధికారులు దాడులు నిర్వహించి 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. తిమ్మాపురం గ్రామ పరిసర ప్రాంతాల్లో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి మోటారు సైకిళ్లపై నాటుసారా రవాణా చేస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకోవడంతో పాటు 2 మోటారు సైకిళ్లను, 20 లీటర్ల నాటుసారా, 270 కేజీల బెల్లం స్వాధీనం చేసుకున్నారు. దీంతో పాటు 260 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. పలు గ్రామాల్లో మంచి నీటి కంటే నాటుసారా పుష్కలంగా దొరుకుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సారా అమ్మకాలు మరింత జోరందుకున్నాయి. కొందరు నాయకుల అండతో సారా వ్యాపారులు ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుకుంటున్నారు. పలు ప్రాంతాల్లో పట్టపగలే జనావాసాల మధ్య విచ్చలవిడిగా వ్యాపారాలు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో వ్యాపారాలు అంతంత మాత్రంగానే జరిగేవి. ప్రస్తుతం పోటాపోటీగా సారా వ్యాపారం కొనసాగిస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. బెల్లం, ప్లాస్టిక్ వ్యర్థాలు, తుమ్మ చెక్క, ఇతర హానికర రసాయనాలు కలిపి ప్రజలకు హాని కలిగించే రీతిలో నాటుసారా తయారు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.



సారాబట్టీలపై దాడులు చేస్తున్న ఎక్సైజ్ అధికారులు (ఫైల్)

> **ఎప్పటికప్పుడు కేసులు నమోదు చేస్తున్నాం:**
> ఎప్పటికప్పుడు కేసులు నమోదు చేస్తున్నాం. నల్లమల పరిధిలోని పలు ప్రాంతాల్లో సారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహిస్తున్నాం. సారా బట్టీలను ధ్వంసం చేస్తున్నాం. సారా తయరీపై ప్రజలకు అవగాహన ఉండాలి. ఎక్కడైనా సారా తయారు చేసినా విక్రయించినా మాకు సమాచారం ఇవ్వాలి.
> ముక్కు వెంకటరెడ్డి, ఎక్సైజ్ సీఐ, మార్కాపురం

దాడులు చేసినా ఆగని వ్యాపారం

ఎక్సైజ్, ఎన్‌ఫోర్సుమెంట్, పోలీసు ఇలా అధికారులందరూ నాటుసారా తయారీ కేంద్రాలపై తరుచూ దాడులు నిర్వహిస్తున్నా పల్లెల్లో, పట్టణాల్లో సారాను అరికట్టలేకపోతున్నారు. కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నా కొద్ది రోజుల్లోనే బయటకు వచ్చి మళ్లీ వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. డబ్బుపై వ్యామోహంతో ప్రజలకు హాని కలిగించే రీతిలో తయారవుతున్న నాటుసారా తయారీపై ఉక్కు పాదం మోపాలని ప్రజలు కోరుకుంటున్నారు.



బట్టీలను ధ్వంసం చేస్తున్న ఎస్సై మహేష్ (ఫైల్)

క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం

యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఏకుల ముసలారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 7 గంటలకు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించే కార్యక్రమం ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

రైతులకు పగటి విద్యుత్ సరఫరాకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

కురిచేడు: రైతులకు మేలైన విద్యుత్ 9 గంటలు పగలు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని ఆ శాఖ ఏఈ రామకృష్ణ తెలిపారు. సాక్షి దినపత్రికలో మంగళవారం కోతలు కోస్తూ.. కన్నీళ్లు పెట్టిస్తూ అనే శీర్షికతో ప్రచురించిన కథనానికి స్పందించిన ఆయన వివరణ ఇచ్చారు. స్థానిక సబ్‌స్టేషనులో 5 మెగావాట్ల పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌లు రెండు ఉన్నాయని, ఓవర్‌లోడైనందున పగలు, రాత్రి ఇవ్వాల్సి వస్తోందని తెలిపారు. స్థానిక సబ్ స్టేషన్‌కు మరో 8 మెగావాట్ల పవర్ ట్రాన్స్‌ఫార్మర్ అవసరమని, దాని కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. అవి మంజూరై రాగానే పగలు నిరంతరాయంగా 9 గంటల విద్యుత్ సరఫరా చేస్తామని తెలిపారు. మండలంలో పెద్దవరం, కల్లూరు గ్రామాల్లో రెండు విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయని, వాటిని పూర్తి చేస్తే మండలంలో ఓవర్ లోడ్ సమస్య ఉండదని చెప్పారు. అప్పటి వరకు ఇబ్బందులు అర్థం చేసుకోవాలని ఆయన కోరారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి



రైతులకు వివరాలు అందజేస్తున్న ఏఓ ఫరూక్

ముండ్లమూరు (కురిచేడు): రైతులు వేసవి కాలంలో తమ సాగు భూముల్లోని మట్టిని సేకరించి పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఫరూక్ తెలిపారు. మండలంలోని ఈదరలో మంగళవారం ఆయన రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి పరీక్షల కోసం గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలన్నారు. ప్రతి రైతు సేవా కేంద్రం వద్ద సామాజిక తనిఖీ కోసం రబీ పంట నమోదు వివరాలు ప్రదర్శించినట్లు తెలిపారు. అభ్యంతరాలు ఉంటే ఈ నెల 15వ తేదీ లోపు గ్రామ వ్యవసాయ సహాయకునికి తెలియజేయాలన్నారు. రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

కందుల కొనుగోలు కేంద్రం తనిఖీ



కందుల కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఏడీఏ

కురిచేడు: స్థానిక ఏఎంసీ మార్కెట్ గోడౌన్‌లో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని దర్శి సహాయ వ్యవసాయ సంచాలకులు బాలాజీనాయక్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఖరీఫ్-2024లో కంది పంట వేసి ఈ-పంట నమోదు చేసుకున్న రైతులు రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని ఏడీఓ బాలాజీనాయక్ సూచించారు. ఇలా చేస్తే కనీస మద్దతు ధరకు విక్రయించుకునేందుకు వీలుంటుందని చెప్పారు. ఏఓ పి.మధుబాబు, వ్యవసాయ సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మోసం చేసిన వ్యక్తిపై కేసు

ముండ్లమూరు (కురిచేడు): వ్యవసాయ పనిముట్లు ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై స్థానిక పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్‌హెచ్‌ఓ కథనం ప్రకారం..మండలంలోని పసుపుగల్లు గ్రామానికి చెందిన బిజ్జం సుబ్బారెడ్డిని తాళ్లూరు మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన దారం నాగార్జునరెడ్డి సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు ఇప్పిస్తానని నమ్మించి అతని వద్ద సుమారు రూ.8 లక్షలు తీసుకున్నాడు. వ్యవసాయ పనిముట్లు ఇప్పించకుండా, డబ్బులు తిరిగి ఇవ్వకుండా మోసం చేసినట్లు బాధితుడు సుబ్బారెడ్డి పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశాడు. ఆ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

యువత పోరును జయప్రదం చేయండి

- కురిచేడు వైఎస్సార్ సీపీ నేతలు

కురిచేడు: విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని బుధవారం ఒంగోలులో జరిగే ఫీజు పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, మండల పార్టీ నాయకులు కోరారు. దర్శిలో మంగళవారం ఫీజు పోరుకు సంబంధించిన పోస్టర్‌ను కురిచేడు నాయకులు, కార్యకర్తలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ ఒంగోలులో జరిగే కార్యక్రమంలో మండలస్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. పార్టీ మండల కన్వీనర్ యన్నాబత్తుల వెంకట సుబ్బయ్య, జిల్లా యువజన సంఘ అధ్యక్షుడు జి.శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ నాయకులు గుంటు పోలయ్య, మండల కో ఆప్షన్ సభ్యుడు కాశీం, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు కండె గంగయ్య యాదవ్, నాయకులు ఆవుల వెంకటరెడ్డి, పోలెబోయిన పెద్ద పెద్దయ్య, ఎన్వీ నాగిరెడ్డి, కోలా సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గిరిజనలు అన్ని రంగాల్లో రాణించాలి

- సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్

పుల్లలచెరువు: పాఠశాలల్లో చదువుకుంటున్న గిరిజన విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రం నుంచి దాదాపు 15 కిమీ అడవిలో ఉన్న చెన్నపాలెం గూడేన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు, చిన్నారులకు పలకలు, పుస్తకాలు, ప్యాడ్స్, పెన్నులు, బలపాలు, చెప్పులు సబ్ కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చదువు విలువ తెలుసుకొని చదువుకోవాలన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను పాఠశాలలకు పంపి చదువుకునేలా చూడాలన్నారు. విద్యను అభ్యసించినప్పుడే అన్ని రంగాల్లో రాణించేందుకు వీలుంటుందని తెలిపారు. గూడేల్లోని ప్రతి చిన్నారి చదువుకోవాలని సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ ఆకాంక్షించారు. గూడేన్ని సబ్ కలెక్టర్ సందర్శించడంతో గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తూ పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా తాగు నీటి కోసం బోరు వేయించాలని విజ్ఞప్తి చేశారు. గారపెంట నుంచి 7 కిమీ దూరంలో ఉన్న చెన్నపాలెం గూడేనికి రహదారి నిర్మించేందుకు అటవీ అధికారులతో అనుమతి మంజూరు చేయించాలని, వ్యవసాయానికి త్రీ ఫేస్ కరెంట్‌ను ఇప్పిస్తే చాలా వరకు తమ సమస్యలు తీరుతాయని సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటానని సబ్ కలెక్టర్ భరోసా ఇచ్చారు. ఆయన వెంట ఎంపీడీవో వసంతరావునాయక్, వీఆర్వో కోటేశ్వరరావు పాల్గొన్నారు.



చిన్నారులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్

ఎమ్మెల్యే బూచేపల్లికి మండలాల అధ్యక్షుల కృతజ్ఞతలు



దర్శి: శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మను సన్మానిస్తున్న వెంకటరెడ్డి, సాంబయ్య



ముండ్లమూరు: చింతా శ్రీనివాసరెడ్డి, బ్రహ్మానందరెడ్డి, నాయకులు

దర్శి (కురిచేడు): దర్శి శాసన సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి, జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మకు దర్శి, ముండ్లమూరు, తాళ్లూరు మండలాల వైఎస్సార్ సీపీ నూతన అధ్యక్షులు మంగళవారం దర్శి పార్టీ కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. దర్శి పట్టణ అధ్యక్షుడు ముత్తినీడి సాంబయ్య, దర్శి మండల అధ్యక్షుడు వెన్నపూస వెంకటరెడ్డి, ముండ్లమూరు మండల అధ్యక్షుడు చింతా శ్రీనివాసరెడ్డి, తాళ్లూరు మండల అధ్యక్షుడు తూము వెంకట సుబ్బారెడ్డిలు వారిని మర్యాదపూర్వకంగా కలిసి గజమాలతో సత్కారం చేసి ఆయా మండలాల పార్టీ అధ్యక్షులుగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు ఇత్తడి దేవదానం, కొల్లా భాస్కర్, సుంకర బ్రహ్మానందరెడ్డి, డగ్లస్, పోశం మధుసూదన్‌రెడ్డి, బొమ్మిరెడ్డి లక్ష్మీరెడ్డి, కోటేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తాళ్లూరు: తూము వెంకట సుబ్బారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నాయకులు

పది పరీక్షలకు ఏర్పాట్లు



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు

పెద్దారవీడు: ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టినట్లు ఎంఈఓ పి. శ్రీనివాసులు తెలిపారు. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలో సిద్ధార్థ హైస్కూల్, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన పదో తరగతి విద్యార్థులు మొత్తం 589 మందిలో బాలురు 313 మంది, బాలికలు 276 మంది పరీక్షలు రాసేందుకు సిద్ధమైనట్లు తెలిపారు. దీని కోసం పెద్దారవీడు, ఏనుగులదిన్నెపాడు, ఓబులక్కపల్లి పరీక్ష కేంద్రాల్లో భాగంగా ఒక్కో కేంద్రానికి 8 మంది ఇన్విజిలేటర్లు, దేవరాజుగట్టు కేంద్రంలో నలుగురు ఇన్విజిలేటర్లు, ప్రతి కేంద్రానికి చీఫ్, డిపార్ట్‌మెంట్ అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు. పెద్దారవీడు, దేవరాజుగట్టు కేంద్రాల పరీక్ష ప్రశ్నపత్రాలు పెద్దారవీడు పోలీస్ స్టేషన్‌లో, ఓబులక్కపల్లి, ఏనుగులదిన్నెపాడు కేంద్రాల పరీక్ష ప్రశ్నపత్రాలు దోర్నాల పోలీస్‌స్టేషన్‌లో పరీక్షలు పూర్తయ్యేంత వరకు భద్రంగా ఉంచుతామన్నారు. దోర్నాల పోలీసుస్టేషన్ నుంచి ప్రత్యేక వాహనంలో కస్టోడియన్ సమక్షంలో ఏనుగులదిన్నెపాడు, ఓబులక్కపల్లి పరీక్ష కేంద్రాలకు తీసుకెళ్తారని చెప్పారు. ప్రతి పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు సరిపడా మౌలిక వసతుల్లో భాగంగా పరీక్ష కేంద్రాల్లో వెలుతురు, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఎంఈఓ వివరించారు.

ప్రజల సమస్యలు పరిష్కరించాలి

ముండ్లమూరు (కురిచేడు): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం డిమాండ్ చేసింది. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా మండల కమిటీ మంగళవారం ప్రజల వద్దకు వెళ్లి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి షేక్ మాబు, కార్యవర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంటలు వచ్చి కరెంటు ఆగిపోతోందని, ఆ మంటలు వచ్చినప్పుడు ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. డ్రైనేజీ వ్యవస్థ బాగు చేయక దోమలతో అనారోగ్య సమస్యలు వస్తున్నాయని, అంతర్గత డ్రైనేజీని శుభ్రం చేయాలని, కొత్త పెన్షన్లు మంజూరు కావడం లేదని, ఉపాధి హామీ పనికి సంబంధించి నాలుగు వారాల బిల్లులు చెల్లించలేదని, మంచినీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు తమ దృష్టికి తెచ్చినట్లు సీపీఎం నాయకులు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చి 10 నెలలవుతున్నా రేషన్ కార్డులు, నూతన పింఛన్లు, ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు ఊసే లేదని మండిపడ్డారు. మండల కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు, కొండలు, బి.హనుమంతరావు, సత్యం, రాజా రమేష్, ఎర్రయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు వింటున్న సీపీఎం నాయకులు

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి

పుల్లలచెరువు: పంటలు సాగు చేసిన రైతులు ఈ-క్రాప్ నమోదుతో పాటు ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి నిర్మలాదేవి అన్నారు. మంగళవారం ఆమె గంగవరం, ముటుకుల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ ప్రస్తుతం ఈ-క్రాప్ నమోదు సమయం పూర్తయిందన్నారు. దానికి సంబంధించి ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ కోసం తమ సమీపంలోని రైతు సేవా కేంద్రంలోని వ్యవసాయ, ఉద్యాన సహాయకులను సంప్రదించి పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. వీఏఏలు కొండానాయక్, కృష్ణానాయక్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.

బెల్లం విక్రయ వివరాలు ఇవ్వాలి

పెద్దదోర్నాల: బెల్లం వ్యాపారులు ప్రతి 15 రోజులకు ఒకసారి తమ వ్యాపారానికి సంబంధించిన క్రయ విక్రయాల వివరాలు అధికారులకు ఇవ్వాలని ఎక్సైజ్ సీఐ. ముక్కు వెంకటరెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో బెల్లం వ్యాపారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా తయారీదారులకు బెల్లం సరఫరా చేయటం నేరమన్నారు. దుకాణాదారులు ఒక కస్టమర్‌కు ఒకేసారి 10 కిలోల కంటే ఎక్కువ బెల్లం అమ్మరాదన్నారు. ట్రేడ్ లైసెన్స్ లేని ఓ వ్యక్తి కూడా 100 కిలోల కంటే ఎక్కువ బెల్లం నిల్వ ఉండరాదని హెచ్చరించారు. అనంతరం వ్యాపారులతో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఎస్సై మహేష్ పాల్గొన్నారు.

నిరుపయోగంగా జెడ్పీ అతిథి గృహం



జెడ్పీ అతిథి గృహం ఇలా..

దొనకొండ: లక్షలాది రూపాయలతో నిర్మించిన జెడ్పీ అతిథి గృహం నేడు నిరుపయోగంగా మారింది. భవనం చుట్టూ చెట్లు మొలిచాయి. భవనం వాడకంలో లేక పోవడంతో తలుపులు, కిటికీలు తుప్పు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో 1998లో రూ.20 లక్షల జెడ్పీ నిధులతో ఈ భవనాన్ని నిర్మించారు. నిర్మించారేగానీ అసలు భవనం ప్రారంభానికి కూడా నోచుకోలేదు. ప్రస్తుతం అలంకార ప్రాయంగా మిగిలింది. 2011లో అప్పటి, ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి కొంతమేర సొంత నిధులు వెచ్చించి అతిథి గృహానికి మరమ్మతులు చేయించి కొద్ది రోజులు వినియోగించుకున్నారు. అనంతరం విద్యాశాఖకు భవనం లేకపోవడంతో ఆ శాఖ అధికారులు కొన్ని రోజులు వాడుకున్నారు. మరికొన్ని రోజులు హౌసింగ్ అధికారులు సిమెంట్ గోడౌన్‌గా వినియోగించుకున్నారు. అప్పటి జెడ్పీ చైర్మన్ ఈదర హరిబాబు దొనకొండకు విచ్చేసిన సమయంలో అతిథి గృహం వినియోగం కోసం నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారేగానీ అమలుకు నోచుకోలేదు. ప్రస్తుతం భవనం నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరింది. దీంతో వర్షాకాలంలో పశుపోషకులు తమ గొర్రెలు, మేకలను భవనంలోకి తోలుకుంటున్నారు. దొనకొండకు వచ్చే పాలకులు ఈ భవనాన్ని పట్టించుకోకుండా రైల్వే శాఖకు చెందిన అతిథి గృహాన్ని ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి జెడ్పీ అతిథి భవనానికి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తెచ్చేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఆ స్థలాన్ని పాఠశాలకు కేటాయించాలి

దర్శి (కురిచేడు): దర్శి పట్టణంలోని డాక్టర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల ప్రాంగణంలోని 50 సెంట్ల స్థలాన్ని అదే పాఠశాలకు కేటాయించాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కన్వీనర్ కపురం శ్రీనివాసరెడ్డి కలెక్టర్ తమీమ్ అన్సారియాను కోరారు. మంగళవారం సాయంత్రం ఆయన కలెక్టర్ కార్యాలయంలో ఆమెను కలిసి ఇప్పటి వరకు ఆ స్థలం ఎవరి అధీనంలో లేదని వినతిపత్రం అందజేశారు. దూరదర్శన్ కేంద్రం, ఎంపీపీ పాఠశాల, ఫైర్‌స్టేషన్, ఇండోర్ స్టేడియం, డీఎస్పీ ఆఫీసు, వ్యవసాయ సహాయ సంచాలకుల కార్యాలయాలు ఎన్ఎస్‌పీ కాలనీలోనే ఉన్నాయని వివరించినట్లు తెలిపారు. గురుకుల పాఠశాలకు ఆ స్థలాన్ని కేటాయించి ప్రహరీ నిర్మిస్తే విషసర్పాల నుంచి విద్యార్థులకు రక్షణ కల్పించినట్లవుతుందని తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా త్వరలో సమస్య పరిష్కరిస్తానని, విద్యార్థులకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు తెలిపారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చి వివరిస్తున్న కపురం

పది విద్యార్థులకు పరీక్షల మెటీరియల్ పంపిణీ



విద్యార్థులతో లయన్స్ క్లబ్ సభ్యులు

దర్శి (కురిచేడు): లయన్స్ క్లబ్ ఆఫ్ దర్శి స్నేహ ఆధ్వర్యంలో 60 మంది 10వ తరగతి విద్యార్థులకు మంగళవారం పరీక్షల మెటీరియల్ ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేశారు. స్థానిక సెయింట్ జేవియర్స్ స్కూల్ ప్రాంగణంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు లయన్ బిజ్జం నాగార్జునరెడ్డి పరీక్షల అట్టలు,పెన్నులు, పెన్సిళ్లు, స్కేళ్లు అందజేశారు. పిల్లలు నైతిక విలువలు, మంచి పౌరులుగా, సేవాగుణం అలవరచుకోవాలని లయన్స్ క్లబ్ సభ్యులు సూచించారు. కార్యక్రమానికి ఎన్విరాన్‌మెంట్ చైర్‌పర్సన్ కల్లూరి విద్యాసాగర్‌రెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ దర్శి స్నేహ సెక్రటరి పానుగంటి వీవీ సత్యనారాయణ గుప్తా, క్లబ్ సభ్యులు చింతా తిరుపతిరెడ్డి, మానవత సంస్థ అధ్యక్షుడు, లయన్ ధనిరెడ్డి వెంకటరెడ్డి, అంబటి గోవిందరెడ్డి, సెయింట్ జేవియర్స్ స్కూల్ ప్రిన్సిపాల్ ఫాదర్ మైకేల్‌రాజు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదుపై సోషల్ ఆడిట్



రైతులతో మాట్లాడుతున్న ఏఓ లక్ష్మీనారాయణ

దొనకొండ: ఈ ఏడాది రబీ పంట కాలంలో ఈ-పంట నమోదు చేసిన రైతులు, పంటల వివరాలు సామాజిక తనిఖీ కోసం ఆయా రైతు సేవా కేంద్రాల్లో రైతుల ప్రదర్శన కోసం ఏర్పాటు చేసినట్లు మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ తెలిపారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రామాపురం రైతు సేవా కేంద్రంలో రైతులకు ఫార్మర్ ఐడీపై ఆయన అవగాహన కల్పించారు. అనంతరం రుద్రసముద్రంలో రైతులు సాగు చేసిన పంట పొలాలను పరిశీలించారు. రైతులకు సూచనలు, సలహాలందజేశారు. ఆయన వెంట వ్యవసాయ సిబ్బంది నాసర్‌వలి, కృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి గోపాల్, రైతులు పాల్గొన్నారు.